క్లుప్తంగా

టెన్త్ సప్లిమెంటరీకి రెండు పరీక్ష కేంద్రాలు

రేపల్లె రూరల్: పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు పట్టణ, రూరల్‌లో రెండు పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి నవీన్‌కుమార్ బుధవారం తెలిపారు. జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న పరీక్షలకు పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్, మండలంలోని పేటేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసామన్నారు. మున్సిపల్ స్కూల్‌లో 210 మంది, పేటేరు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 306 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు వివరించారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే విద్యార్థులు చేరుకోవాలని తెలిపారు. అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



రేపల్లె: నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్‌ఐ అబ్దుల్ రజాక్ హెచ్చరించారు. పట్టణ శివారు ఇసుకపల్లి వేపాళ్లమ్మ చెరువు సమీపంలోని రామమందిరం రహదారిలో బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. పలు వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు తప్పనిసరిగా తమతో ఉంచుకోవాలని సూచించారు. నంబరు ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటోలో అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



పిట్టలవానిపాలెం: రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ షేక్ బాజీ సూచించారు. చందోలు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. వైద్యశాలలో అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. వైద్యశాలకు ప్రత్యేక వైద్య నిపుణులు వారంలో ఒక రోజు వస్తున్నారని, రోగులకు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ లీలా క్రాంత్ కర్మల్ తెలిపారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి



నిజాంపట్నం: నేరాల నియంత్రణకు గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని రేపల్లె రూరల్ సీఐ ఎ.శివశంకర్ సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై మండలంలోని బావోజీపాలెం గ్రామంలో వ్యాపారులకు బుధవారం అవగాహన కల్పించారు. సీసీ కెమెరాల ఏర్పాటు చేయటంతో దొంగతనాలు నివారించవచ్చని, ఆకతాయిల అల్లర్లను కట్టిపెట్టేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. వ్యాపారులు తమ దుకాణాల్లో తప్పనిసరిగా కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట నిజాంపట్నం ఎస్‌ఐ రమేష్ తదితరులున్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

భట్టిప్రోలు: వైఎస్సార్ కంటి వెలుగు (అవ్వా-తాత) ఫేజ్-3 కార్యక్రమంలో భాగంగా భట్టిప్రోలు పీహెచ్‌సీ పరిధిలోని జెండా చెట్టు వద్ద బుధవారం 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పారామెడికల్ అప్తాలమిక్ అసిస్టెంట్ (పీఎంవోఏ) పెనుమాల అరుణ రాణి పరీక్షలు చేశారు. 60 మందిని పరీక్షించగా 16 మందికి కళ్ల జోళ్లు అవసరం కాగా ముగ్గురుని రిఫరల్‌కు పంపడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వో డి.మాతయ్య, ఏఎన్ఎం సీహెచ్ రత్నకుమారి, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు నందం లీలాకుమారి, గాడల్లి నిర్మలాకుమారి, ఆదిన వరలక్ష్మి, మద్దుల లక్ష్మి అంక సరస్వతీ, శ్రీరాముల వెంకట రమణ, పి.కలిమిలారాణి పాల్గొని వైద్య సేవలు అందించారు.

పొన్నూరు ఆర్టీసీ డీఎంగా అజితకుమారి

పొన్నూరు (చేబ్రోలు): పొన్నూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా టి.అజిత కుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా బాపట్ల డిపోకు చెందిన టి.అజితకుమారి పొన్నూరుకు బదిలీ అయ్యారు. ఇక్కడ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న టి.శ్రీనివాస్ బాపట్ల డిపోకు బదిలీ అయ్యారు.

సీఎం వైఎస్ జగన్ పాలన చరిత్రాత్మకం

'గడప గడపకు' కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున



మహిళను ఆత్మీయంగా పలకరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

వరహాపురం(వేమూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చరిత్రాత్మక పాలన అందిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. వేమూరు మండలంలోని వరహాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లిన మంత్రి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరును తెలుసుకున్నారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ఏకైక లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎన్నికల హామీలను సీఎం 98 శాతం నేరవేర్చారని గుర్తుచేశారు. గ్రామంలో డ్రెయినేజీ, రోడ్లు వేయించాలని గ్రామస్తులు కోరారు. ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సచివాలయ పరిధిలో అభివృద్ధికి నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఈ నిధులతో సిమెంట్ రోడ్లు వేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలను అభివృద్ధి బాటలో నడిపించేందుకు పని చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, బొల్లిముంత ఏడుకొండలు, యల్లమాటి పరిశుద్ధరావు, యల్లమాటి భాస్కరరావు, అరమళ్ల సంధ్యారాణి, ఈపూరు ప్రసాద్, యల్లమాటి సుదర్శనరావు, యల్లమాటి చంటి, అరమళ్ల లాజరు, అరమళ్ళ ఏసోబు, యల్లమాటి శ్రీనివాసరరావు, యల్లమాటి వెంకయ్య, కండెల మోహన్, పెరవలి సంపోను, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

వేమూరు మండలంలోని వరహాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి మేరుగ నాగార్జున పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ

రేపల్లె: పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ నెల పట్టణాభివృద్ధికి రూ.1.29 కోట్లు వినియోగించనున్నట్లు చెప్పారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజల తాగునీటి అవసరాలను తీర్చే విధంగా అధికార యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించటం అభినందనీయమన్నారు. ప్రజా సమస్యలపై అందించే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించే దిశగా అధికారులు ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. వార్డుల్లో పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రత్యేక డ్రైవ్‌లతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. కాలుష్య నివారణలో పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు ప్రజల భాగస్వామ్యం కావాలని కోరారు. ఇటీవల మృతి చెందిన రెండవ వార్డు మాజీ కౌన్సిలర్ కఠెవరపు యేసోబు మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి, సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, ఏఈ శ్రీకాంత్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

పట్టణాభివద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దటంతో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకరట రమణారావు నిరంతరం కృషి చేస్తున్నారని మున్సిపల్ వైస్‌చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. పట్టణం ముఖద్వారంగా ఉన్న ఓల్డ్‌టౌన్ అంకమ్మచెట్టు సెంటర్‌లో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న పరిస్థితులను గమనించి రోడ్డు అభివృద్ధి పనులు నిర్వహించటం జరిగిందన్నారు. అదే విధంగా రోడ్డు, డ్రెయిన్లు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో పట్టణంలో మోడల్ టౌన్‌గా రూపాదించటం జరుగుతుందన్నారు.

సహకార సంఘాలతో రైతులకు మేలు

- రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- వరహాపురం సహకార సంఘం అధ్యక్షుడిగా తాడికొండ శ్రీనుబాబు ప్రమాణస్వీకారం



అధ్యక్షుడిగా తాడికొండ శ్రీనుబాబు ప్రమాణ స్వీకారంలో మంత్రి మేరుగ నాగార్జున

వరహాపురం(వేమూరు): వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులను ఆదుకోవడం జరుగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. వేమూరు మండలంలోని వరహాపురం వ్యవసాయ సహకార సంఘం పాలక వర్గం అధ్యక్షుడిగా తాడికొండ శ్రీనుబాబు ప్రమాణ స్వీకారం బుధవారం జరిగింది. డైరెక్టర్లుగా యల్లమాటి పరిశుద్ధరావు, చందు అజయ్‌కుమార్ ఎన్నిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ వరహాపురం వ్యవసాయ సహకారం సంఘం పరిధిలోని వరహాపురం, చదలవాడ, కాకర్లమూడి, కుచ్చెళ్లపాడు, వెల్లబాడు గ్రామాల్లో రైతులకు రుణాలు, ఎరువులు, అందించడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ సహకారం సంఘం ద్వారా రైతులకు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు అందించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వాలు కుచ్చెళ్లపాడు గ్రామానికి సొసైటీ అధ్యక్ష పదవి ఇంత వరకు ఇవ్వలేదన్నారు. ఆ గ్రామానికి మొదటి సారిగా అధ్యక్ష పదవి దక్కిందన్నారు. శ్రీనుబాబు రైతులకు మెరుగైన సేవలు అందించి, పార్టీకి మంచి పేరు తీసుకొని రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, చందోలు డేవిడ్ విజయకుమార్, బొల్లిముంత ఏడుకొండలు, వేమూరు సొసైటీ అధ్యక్షులు గాజుల భాను ప్రకాశ్, దాది సుబ్బారావు, విష్ణు మొలకల వెంకట రెడ్డియ్య, దున్నా మేరీసుబాబు, గాజుల మోహన్, బొల్లిముంత వెంకటేశ్వరరావు, షేక బాజీ, సర్పంచ్‌లు వెల్లబాటి బుల్లియ్య, గాజుల వెంకట సుబ్బయ్య, లక్ష్మీతిరుపతమ్మ శ్రీనివాస్, సొసైటీ కార్యదర్శి సురేష్, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి రోజు మార్చి రోజు నీటి సరఫరా

బాపట్ల: బాపట్ల మున్సిపాల్టీ పరిధిలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో.. నీటి సరఫరా రోజు మార్చి రోజు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ తెలిపారు. పీటీ చానల్ నుంచి నీటి సరఫరాను ఇరిగేషన్ అధికారులు విడుదల చేసే వరకు నీటి సరఫరా రోజు మార్చి రోజు ఉంటుందని, ప్రజలు గమనించాల్సిందిగా కమిషనర్ కోరారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


కొల్లూరు: జీవనోపాధి కోసం వచ్చిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటనపై కొల్లూరు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా, హీర మండలం, శొలిపి గ్రామానికి చెందిన కొండగొర్రి గోవిందరావు మొక్కజొన్న కండెలు పనికి మండలంలోని దోనేపూడికి వచ్చాడు. మతిస్థిమితం అంతంత మాత్రంగా ఉండే గోవిందరావు మే-8న తన సొంత గ్రామానికి వెళ్లేందుకు కొల్లూరులో బస్సు ఎక్కాడు. 15వ తేదీ వరకు గ్రామానికి చేరుకోకపోవడంతో గోవిందరావును పనికి తీసుకువచ్చిన జగన్ అనే వ్యక్తిని, అతని సోదరుడు పోలినాయుడు తన తమ్ముడి గురించి అడిగాడు. సొంత ఊరుకు వెళ్లేందుకు బస్సు ఎక్కాడని తెలపడంతో పలుచోట్ల వెతికినా అతని ఆచూకీ లభించకపోవడంతో కొల్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రామయ్య తెలిపారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



భట్టిప్రోలు: భట్టిప్రోలు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేఖ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పొగాకు వల్ల కలిగే అనర్థాలపై స్లోగన్స్ ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ఎ. శ్రీనివాసరావు, సీహెచ్‌వో డి.మాతయ్య, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఎంపీహెచ్ఎలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పాటెమ్మతల్లి గ్రామోత్సవం



గొడవర్రు (చేబ్రోలు): చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామంలోని గ్రామదేవత పాటెమ్మ తల్లి అమ్మవారి గ్రామోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. పురాతనమైన పాటెమ్మతల్లి అమ్మవారి దేవాలయం జీర్ణోద్ధరణకు చేరింది. భక్తుల సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మించారు. గురువారం అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్టా మహోత్సవం జరగనుంది. దీనిలో భాగంగా అమ్మవారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేళతాళాలతో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

హైందవ సంస్కృతి పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ

టీటీడీ జిల్లా దేవాలయాల నిర్మాణ నిర్వహణ కమిటీ కన్వీనర్ జ్వాలా నరసింహం

రేపల్లె: హైందవ సంస్కృతి పరిరక్షణకు సమరసత సేవా ఫౌండేషన్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు టీటీడీ జిల్లా దేవాలయాల నిర్మాణ నిర్వహణ కమిటీ కన్వీనర్ జ్వాలా నరసింహం అన్నారు. సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మాణం జరిగిన దేవాలయాల పర్యవేక్షణలో భాగంగా జిల్లా బృందం కూచనపూడి ఎస్టీ కాలనీ, రేపల్లె 1వ వార్డు ఎస్టీ కాలనీ, గుళ్ళపల్లి ఎస్టీ కాలనీల్లో నూతనంగా నిర్మించిన దేవాలయాలను సందర్శించారు. దేవాలయాలు అన్ని హంగులతో పూర్తి చేసుకొని ప్రతిష్ఠ మహోత్సవాలు జరగటం ఆనందంగా ఉందన్నారు. కనగాల, నల్లూరు సౌత్, పోటుమెరక గ్రామాల్లో దేవాలయాల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. దేవాలయాల నిర్మాణంతో ప్రజల్లో భక్తిభావం పెంపొందించి, ఆధ్యాత్మిక జీవితం అలవరచుకునేలా కృషి చేయవచ్చన్నారు. ఫలితంగా ప్రశాంతత నెలకొంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, జిల్లా సహ కన్వీనర్ రాయపూడి అంకమ్మ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా గృహ నిర్మాణాలు చేపట్టేలా చూడాలి

రేపల్లె ఆర్డీవో జగన్నాథం పార్థసారథి



అధికారులతో సమీక్షిస్తున్న రేపల్లె ఆర్డీఓ పార్థసారథి, తహసీల్దారు కనకదుర్గ

చుండూరు(భట్టిప్రోలు): వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా చూడాలని రేపల్లె ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి ఆదేశించారు. చుండూరు తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్న దృష్ట్యా జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మాణాలు చేపట్టే దిశగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే గృహాలు మొదలు పెట్టనివారి వివరాలు సేకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు బి.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కార్డుల మంజూరుకు స్పెషల్ డ్రైవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ డి.రాంబాబు

కర్లపాలెం: ఇప్పటి వరకు ఆధార్ కార్డులు లేనివారిని గుర్తించి వెంటనే మంజూరు చేయాలని ఎంపీడీఓ దాసరి రాంబాబు ఆదేశించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. కొందరు పేదలకు అర్హత ఉన్నా ఆధార్ కార్డులు లేకపోవటం వల్ల సంక్షేమ పథకాలు అందటం లేదని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ఆధార్ కార్డులు లేని వారిని గుర్తించి, వారికి కార్డులు మంజూరు చేయాలని చెప్పారు. గ్రామ పంచాయతీల వారీగా వలంటీర్ల సహాయంతో ఆధార్‌కార్డులు లేనివారిని ఆధార్ కేంద్రాలకు తీసుకువచ్చి ఫోటోలు తీయించి మంజూరు చేయాలని చెప్పారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దారు సలీమా, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కొల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారిపై రెండో దఫా విచారణ



కొల్లూరు పీహెచ్‌సీలో విచారిస్తున్న అధికారులు

కొల్లూరు: కొల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిపై వెల్లువెత్తిన ఆరోపణలపై హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ విచారణ కొనసాగుతోంది. మే-23న ఎన్‌సీడీ జాయింట్ డైరెక్టర్ టీవీఎస్ఎస్ శాస్త్రీ, ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రోగ్రాం ఆఫీసర్ నిర్మలగోరి మొదటి దఫా విచారణ నిర్వహించారు. అనంతవరం సచివాలయ ఏఎన్ఎం పీఎన్‌టీ కుమారి వైద్యాధికారి డి.రవిబాబు, హెల్త్ సూపర్ వైజర్ వి.మేరిలపై పలు ఆరోపణలు చేస్తూ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. బుధవారం పీహెచ్‌సీలో రెండో విడత జరిగిన విచారణలో వైద్యాధికారి రవిబాబుతో సన్నిహితంగా ఉన్న మహిళా సిబ్బంది, ఆరోజు విచారణకు హాజరు కాని ఇతర సిబ్బందిని టీవీఎస్ఎస్ శాస్త్రీ, నిర్మలగోరి విచారించి లిఖితపూర్వక సమాచారం సేకరించారు. విచారణ ప్రక్రియ ముగియడంతో సిబ్బంది తెలిపిన సమాచారం ఆధారంగా ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.

పల్లెకోనలో ఉచిత వైద్య శిబిరం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖ సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు

పల్లెకోన(భట్టిప్రోలు): పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పల్లెకోనలో 31వ డాక్టర్ డి.రామానాయుడు అఖిల భారత ఆహ్వాన నాటకోత్సవాల్లో భాగంగా బుధవారం ఆంధ్రా హాస్పిటల్ హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్ ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అచ్యుత్‌బాబు ఆధ్వర్యంలో వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 200 మందికి గుండె, ఉదర సంబంధిత, కంటి, ఎముకలు, దంత పరీక్షలు నిర్వహించినట్లు మెమోరియల్ ట్రస్ట్ కోశాధికారి వీవీ రాజగోపాల్ తెలిపారు. ఈ క్యాంప్‌ను ప్రముఖ సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాటకోత్సవ సమన్వయకర్త డి. రామకోటేశ్వరరావు పద్మావతి, వేజండ్ల బసవపున్నారావు, మండవ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీ

ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు



ట్రాక్టర్ కిందకు దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం

కోనేటిపురం(భట్టిప్రోలు): వేగంగా ఇసుకలోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం భట్టిప్రోలు మండలం కోనేటిపురం వద్ద జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం భట్టిప్రోలు నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్.. కోనేటిపురం వద్ద రేపల్లె వైపు నుంచి వస్తున్న అద్దేపల్లికి చెందిన పసుపులేటి నరసింహారావు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ట్రాక్టర్ కిందకు దూసుకెళ్లడంతో.. తీవ్ర గామయాలపాలైన నరసింహారావును రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. భట్టిప్రోలు పోలీసులను వివరణ కోరగా సమాచారం తమ దృష్టికి వచ్చిందని ఆసుపత్రి నుంచి వచ్చిన రిపోర్టు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బాపట్ల అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ నాయకుడు ఇనగలూరి మాల్యాద్రి అన్నారు. ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్ ప్రమాణస్వీకారం చేసి, నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం బాపట్ల పట్టణంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి, వేడుకలు చేసుకున్నారు. మాల్యాద్రి మాట్లాడుతూ కుల,మత, పార్టీలకతీతంగా అర్హతే ప్రమాణికంగా ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత సీఎంకే దక్కుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు, బాపట్ల ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు చేజేర్ల నారాయణరెడ్డి, వడ్డెముక్కల డేవిడ్, చింతల రాజశేఖర్, నక్కా వీరారెడ్డి, జాలి రెడ్డి, పిట్టూ శ్రీధర్ రెడ్డి, సీకే నాయుడు, అడే క్యాత్రిన్ రాజు, జోగి రాజా, షేక్ అఫ్జల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



బాపట్ల అర్బన్: సువర్చల సమేత ప్రపత్త్యాంజనేయస్వామి ఆలయ 74వ వార్షిక కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. బుధవారం 16 రోజుల పండుగ సందర్భంగా స్వామివారికి పంచామృత స్నపన, హనుమాన్ చాలిసా, పారాయణం, సిందూర అర్చన, ఊంజల్ సేవ, పూలంగి సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వినుకొండ సత్యంబాబు, రామకృష్ణ భార్గవ, మారుతీరామ బాలభక్త సమాజం అధ్యక్షుడు నెమలికంటి హనుమంతరావు, దేశిరాజు వెంకట రమణబాబు, కొలను నెమలికంటి హనుమంతరావు, దేశిరాజు వెంకట రమణబాబు, కొలను మోహన్, వక్కలగడ్డ శ్రీనివాసరావు భక్తులు పాల్గొన్నారు.

దశావతార వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలందుకుంటున్న స్వామివారి ఉత్సవమూర్తులు

పెదకాకాని: నంబూరు దశావతార వేంకటేశ్వర స్వామి వారికి బుధవారం ప్రత్యేక పూజలు జరిపించారు. నంబూరు ఐజేఎం పక్కనే ఉన్న దశావతార వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో ఆరు రోజుల పంచమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరిరోజు బుధవారం అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. స్వామివారిని శోభాయమానంగా అలంకరించి పూజా క్రతువు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు నరసింహాచార్యులు తెలిపారు. పూజా కార్యక్రమాలలో భాగంగా ఉదయం 9గంటలకు చక్రస్నానం, వసంతోత్సవం, శ్రీకృష్ణ, కల్కి అవతార వేంకటేశ్వర యజ్ఞం, గజ వాహనంపై శ్రీకృష్ణ అవతార స్వరూప ఉత్సవం, కల్కి అవతార స్వరూప ఉత్సవం, మహా పూర్ణాహుతి, సాయంత్రం 6గంటలకు తెప్పోత్సవం, ద్వాదశ ప్రదక్షిణాలు, పవళింపు సేవ శాస్త్రోక్తంగా జరిపించినట్లు నిర్వాహకులు లింగమనేని పూర్ణభాస్కరరావు తెలియజేశారు.

3న ఉచిత మెగా వైద్యశిబిరం

రేపల్లె రూరల్: పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో బాదినేని వెంకట కృష్ణప్రసాద్ జ్ఞాపకార్థం ప్రగతి నారి శక్తి పబ్లిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ ఆర్యవైశ్య సంఘాల పర్యవేక్షణలో ఈ నెల 3న శనివారం ఉదయం 9 గంటలకు కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ వారిచే ఉచిత మెగావైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు దేశబోయిన భాగ్యలక్ష్మి, మారం శ్రీప్రియ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, టూడీ ఎకో పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు. గుండె, గర్భకోశ సంబంధిత, కీళ్లు, కంటి పరీక్షలు, యూరాలజీ, మానసిక వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించబడునన్నారు. పరిసర ప్రాంత ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే రోటరీ క్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 4 ఆదివారం ఉదయం 9గంటలకు పట్టణంలోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాలులో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 83319 50919, 99480 33828 నంబర్లకు సంప్రదించాలని చెప్పారు.